క్లుప్తంగా

ట్యూషన్ విద్యార్థులకు వన భోజనాలు



రామకృష్ణ మఠానికి నమస్కరిస్తున్న ట్యూషన్ విద్యార్థులు

జగదాంబ: స్వామి వివేకానంద సంస్థ ట్యూషన్ విద్యార్థులకు వన భోజనాలు ఏర్పాటు చేశారు. కార్తీక మాసం ఆఖరి రోజు కావడంతో విద్యార్థులకు రుషికొండ, శివాలయం చూపించారు. జూపార్కులో వన భోజనాలు ఏర్పాటు చేశారు. రామకృష్ణ మఠం సహకారంతో ఉచిత ట్యూషన్ నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు అప్పారావు తెలిపారు. అంతే కాకుండా ఉచిత పురాణజ్ఞానం, నామ సంకీర్తన వంటివి విద్యార్థులకు నేర్పిస్తామన్నారు. ఈ వారం విద్యార్థులను పిక్నిక్ కోసం తీసుకు వచ్చినట్లు అప్పారావు తెలిపారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని అలకంరించి, హారతి పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యే చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

పోలి పాడ్యమికి సర్వం సిద్ధం



కెప్టెన్ రామారావు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కృత్రిమ కొలను

అల్లిపురం: కార్తీక మాసం ముగిసింది. సోమవారం పోలి పాడ్యమి సందర్భంగా శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలో కొలనులు, చెరువులు లేకపోవటంతో దేవాలయాల వద్ద కృత్రిమ కొలనులు ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారు జాము నుంచి మహిళా భక్తులు దేవాలయాలకు వెళ్లి దీపారాధనకు, నెల రోజుల పూజల సందర్భంగా బ్రాహ్మణులకు దానాలిచ్చేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్‌కు అడ్డుకట్ట



ప్లకార్డులు విడుదల చేస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు

మహారాణిపేట: అవగాహనతోనే ఎయిడ్స్‌కు అడ్డుకట్ట పడుతుందని ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ శిష్టా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మహారాణిపేటలో ఉన్న ప్రకృతి చికిత్సాలయంలో శ్రీ గాయిత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎయిడ్స్‌పై అవగాహన పోస్టర్లు, ప్లకార్డులు విడుదల చేశారు. డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఏఆర్‌టీ మందుల వల్ల ఎయిడ్స్ తగ్గుముఖం పట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, ప్రముఖ అథ్లెటిక్ డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, డాక్టర్ వై.లక్ష్మణరావు. ఎస్.మహేష్ చాతుర్య, కేశవరావు, కొండమ్మ, మంగ రమణ, బంగారమ్మ ,శైలజ, భావనదాస్ (అస్సాం)శివ, సారథి, చిన వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎండైనా.. వానైనా ఆరుబయటే

నిరీక్షణ



బీఆర్ రెడ్డి జంక్షన్‌లో చెట్టు నీడలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

నగరంలో వాణిజ్య కేంద్రంగా ఒకప్పుడు ఎంతో పేరున్న అల్లిపురం ప్రాంతం ఇప్పుడు మాత్రం అభివృద్ధిలో వెనుకంజలోనే ఉందని చెప్పాలి. మార్కెట్లు, దుకాణ సముదాయాలు కావలసినన్ని ఉన్నప్పటికీ ఈ ప్రాంతం పరిధిలోని పలు చోట్ల ఇప్పటికీ బస్టాపులు లేక ప్రయాణికులు ఎండైనా.. వానైనా చెట్ల నీడలోను, దుకాణాల కింద నిలబడి బస్సుల కోసం నిరీక్షిస్తూ కావలసిన చోటుకు ప్రయాణిస్తూ ఉంటారు. ఇప్పటికైనా అధికారులు తమ మొర ఆలకించి బస్టాపులు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

- సౌత్ జైలురోడ్డు, బీఆర్ రెడ్డి జంక్షన్, చావులమదుం కూడలిలో బస్టాపులు లేక ప్రయాణికుల ఇక్కట్లు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

అల్లిపురం: జీవీఎంసీ 28, 29, 30 వార్డుల్లో బస్టాపులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సౌత్ జైలురోడ్డు, బీఆర్ రెడ్డి జంక్షన్ రెండు బస్టాపుల్లోను చెట్టు నీడే ప్రయాణికులకు దిక్కవుతోంది. చావులమదుం జంక్షన్‌లో బస్టాపు లేకపోవటంతో ప్రయాణికులు ఎండ, వర్షంలో నిల్చుని బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తుంది. అదే విధంగా జెండా చెట్టు ప్రాంతం వద్ద కూడా బస్టాపు లేకపోవటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నగరంలో పలు బస్టాపుల వద్ద బస్ షెల్టర్లను జీవీఎంసీ ఏర్పాటు చేసింది. వాటి ద్వారా ప్రకటనలతో ఆదాయాన్ని ఆర్జిస్తోంది. అదే విధంగా బస్టాపులు లేని చోట కూడా బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రభుత్వాలు మారుతున్నా..



ప్రభుత్వాలు మారుతున్నా బస్టాపుల ఏర్పాటులో జాప్యం తప్పటం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఎండా కాలం, వర్షా కాలంలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకే సిటీలో ఉన్నా బస్టాపుల ఏర్పాటులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మధురవాడ వరకు ఆధునిక బస్టాపులు ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌కు కూతవేటు దూరంలో ఉన్నా అల్లిపురం ప్రాంతంలో అభివృద్ధి మాత్రం శూన్యమని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా బస్టాపులు లేని చోట షెల్టర్లు, బస్టాపులు నిర్మించాలని కోరుతున్నారు.

జెండా చెట్టు వద్ద బస్ షెల్టర్ లేక చెట్టు నీడను ఆశ్రయించిన ప్రయాణికులు

బస్టాపులు లేకపోవటం శోచనీయం..



అల్లిపురం ప్రాంతానికి ఎంతో పేరున్నా ఇక్కడ బస్టాపులు ఏర్పాటు చేయకపోవడం బాధాకరం. చక్కటి పేరున్నా ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు. పాలకులు గాని, జీవీఎంసీ అధికారులు గాని కనీసం పట్టించుకోకపోవటం దురదృష్టకరం. ఇప్పటికైనా బస్టాపులు ఏర్పాటు చేసి ప్రయాణికుల వెతలు తీరుస్తారని ఆశిస్తున్నాం.
– పీవీఎన్ రెడ్డి, అమ్మవారివీధి

షెల్టర్ లేక ఇబ్బంది పడుతున్నాం



జెండా చెట్టు వద్ద పురాతన బస్టాపు ఉండేది. ఈ ప్రాంతం నుంచి పూర్ణామార్కెట్, పాతపోస్టాఫీసు, కలెక్టరేట్, ఆర్కే బీచ్‌కు వెళ్లేందుకు బస్సులున్నాయి. కానీ బస్టాపు లేకపోవటంతో ఎండకు, వర్షానికి ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ముసలివాళ్లు, పిల్లలు బస్టాప్ లేక ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి బస్టాపు, షెల్టర్ ఏర్పాటు చేయాలి.
–షేక్ మదీనా, జెండా చెట్టు వీధి

పేరుకే వీఐపీ రోడ్డు..



డాబాగార్డెన్స్ నుంచి చావులమదుం రోడ్డు పేరుకే వీఐపీ రోడ్డు. ఇక్కడ కనీసం బస్టాపు కూడా లేదు. దీంతో ప్రయాణికులు చెట్ల నీడలోను, దుకాణాల వద్ద ఆశ్రయం పొందుతున్నారు. అల్లిపురం ప్రాంతంలో బీఆర్ రెడ్డి జంక్షన్, చావులమదుం రోడ్డు, జెండా చెట్టు, రామకృష్ణా రైతుమార్కెట్ ప్రాంతాల్లో బస్టాపులు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికై నా జీవీఎంసీ, ఆర్టీసీ అధికారులు బస్టాపులు ఏర్పాటు చేయాలి.
– పాల శ్రీహరిరెడ్డి, కుమ్మరవీధి



బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

నేటి నుంచి మార్గశిర మాసోత్సవాలు



శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

అల్లిపురం: కురుపాం మార్కెట్‌లో గల కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సోమవారం నుంచి మార్గశిర మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి దోమా వెంకట బాలాజీకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మార్గశిర మాసంలో నాలుగు గురువారాలు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, మహిళలచే సామూహిక కుంకుమ పూజలు ఉంటాయన్నారు. మొదటి గురువారం అమ్మవారికి రజత వస్త్రాలంకరణ, తామర గింజలతో విశేష పూజ ఉంటుందన్నారు. రెండవ గురువారం అమ్మవారికి ముత్యాల వస్త్రాలంకరణ, లక్ష్మీ గవ్వలతో ప్రత్యేక పూజ, మూడవ గురువారం అమ్మవారికి సువర్ణ వస్త్రాలంకరణ, గోమతి చక్రాలతో పూజ, సామూహిక కుంకుమ పూజ, నాల్గవ గురువారం అమ్మవారు కనకమహాలక్ష్మీ అమ్మవారి రూపంలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారని తెలిపారు. ఆ రోజు ప్రత్యేకంగా భారతీయ కరెన్సీ నాణాలతో ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు.

రెవెన్యూ నూతన కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారులు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) భీమిలి డివిజన్ ఎన్నికలు ఆదివారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న రెవెన్యూ భవన్‌లో నిర్వహించారు. ఏపీఆర్ఎస్ఏ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.ఎం. జిలానీ ఎన్నికల అధికారిగా, నగర అధ్యక్షుడు బీవీఏఎస్ నియోగి అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. 2024 నుంచి 2027 వరకు ఉండే నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్.చేతన్ కుమార్ (డీటీ, ఆనందపురం మండలం), అసోసియేట్ అధ్యక్షుడిగా కె.సుధాకర్ (డీటీ, ఆర్‌డీవో ఆఫీసు భీమలి), ఉపాధ్యక్షులుగా ఎ.వెంకటేష్ (సీనియర్ అసిస్టెంట్, ఆర్‌డీవో, భీమిలి), ఎల్.లోకేష్ (టైపిస్టు, ఆనందపురం తహసీల్దార్ ఆఫీసు), డి.శ్యామల (ఆర్ఐ, పద్మనాభం తహసీల్దార్ ఆఫీసు), కార్యదర్శిగా సీహెచ్ రవి కృష్ణ (డీటీ, పద్మనాభం తహసీల్దార్ ఆఫీసు), సంయుక్త కార్యదర్శులుగా టి.మల్లేశ్వరరావు (ఆర్ఐ, భీమిలి తహసిల్దార్ ఆఫీసు), ఏవీ కిషోర్ (ఆర్ఐ, విశాఖ రూరల్ తహసీల్దార్), ఎండీ ముస్తఫా(ఆనందపురం తహసీల్దార్ ఆఫీసు), కోశాధికారిగా ఎస్.కె.ఇబ్రహీం (సీనియర్ అసిస్టెంట్, సీతమ్మధార), ఈసీ సభ్యులుగా టి.రామచంద్, పి.జ్ఞానదీప్ తదితరులు ఎన్నికయ్యారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళల ప్రదర్శన



హస్తకళలను పరిశీలిస్తున్న సందర్శకులు

అల్లిపురం: భారతీయ సంప్రదాయ కళలు, చేనేత వస్త్రాలు, హస్తకళల వస్తువులతో నగరంలోని గ్రీన్ పార్క్ హోటల్లో ఏర్పాటు చేసిన వసంతం చేనేత, హస్తకళల ప్రదర్శన నగరవాసులను ఆకట్టుకుంటోంది. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రదర్శన ఆదివారం ఉదయం ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనలో వస్త్రాలు, గృహోపకరణాలు, అలంకరణ వస్తువులు, వ్యక్తిగత సంరక్షణ సామగ్రి తదితర అనేక రకాల ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నారు. దేశం నలుమూలల నుంచి తీసుకొచ్చిన సాంప్రదాయ, ఆధునిక ఫ్యాషన్ వేర్, కాంచీపురం, గద్వాల్, చందేరీ, అస్సాం మొదలైన ప్రత్యేక చీరలను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. హస్తకళా నైపుణ్యంతో రూపొందించిన హ్యాండ్ బ్యాగ్స్, పాదరక్షలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. యువతరం మెచ్చే యునిసెక్స్ షర్టులు, కో ఆర్డ్ సూట్‌లు, పురాతన భారతీయ కళాఖండాలు ప్రదర్శనలో ఉంచారు. చేతి వృత్తులు, హస్తకళల కళాకారులను ప్రోత్సహించే నిమిత్తం వసంతం ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

గీతా మౌఖిక పోటీలకు విశేష స్పందన



ప్రశంసా పత్రాలతో పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

అల్లిపురం: శ్రీ గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీ గీతా మౌఖిక పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీల్లో ప్రత్యక్షంగా 250 మంది, ఆన్‌లైన్‌లో 150 మంది నాలుగు విభాగాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని గీతా ప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే భగవద్గీతలో గల శ్లోకాలను పూర్తిగా నేర్చుకుని తద్వారా ప్రతి ఒక్కరూ గీతా సారాంశాన్ని తెలుసుకోవాలన్నారు. ఉపాధ్యక్షుడు పి.జగన్మోహనరావు మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునునికి ఉపదేశించిన భగవద్గీతను నేర్చుకోవడం ద్వారా సంస్కారం, భక్తి, జ్ఞానం ప్రతి ఒక్కరికి కలుగుతాయన్నారు. వేడుకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎం.వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, జి. లక్ష్మీనరసింహ, విద్యార్థులు, గీతా ప్రచార సమితి సభ్యులు పాల్గొన్నారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రశంసా పత్రాలు అందజేశారు.


సాహితీ మంజూష వ్యాస సంపుటి ఆవిష్కరణ



సాహితీ మంజూష వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తున్న అతిథులు

మహారాణిపేట: విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఆచార్య వెలమల సిమ్మన్న రచించిన సాహితీ మంజూష వ్యాస సంపుటి ఆవిష్కరణ ఆదివారం జరిగింది. విశాఖ సాహితీ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో నేషనల్ ఇన్‌స్రూ కంపెనీ మేనేజర్ రాంపిల్ల శివాజీ సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ముందు తరాలు అందించిన సాహిత్య నిధిని మన దైనందిన జీవితానికి అన్వయించగలిగితే వ్యక్తి వికాసం, సమాజ జీవనం సుఖమయం అవుతాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన విశాఖ సాహితీ ఉపాధ్యక్షులు డాక్టర్ కందాళం కనక మహాలక్ష్మి మాట్లాడుతూ ఆచార్య సిమ్మన్న సామాజిక ప్రయోజనం గల రచనలు, విద్యార్థులకు ఉపయుక్తమయ్యే రచనలు చేశారని అభినందించారు. సిమ్మన్న ఈ పుస్తకాన్ని ప్రముఖ కవి, నాటక రచయిత, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజుకు అంకితం ఇచ్చారు. పుస్తకాన్ని సమీక్షించిన డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ సిమ్మన్న సాహిత్యంలో అభ్యుదయ భావాలు గల రచయితల ప్రస్తావన ఉంటుందన్నారు. బోయి భీమన్న దళిత దృక్పథం, తాపీ ధర్మారావు హేతువాద దృష్టిని పరిశీలించారు అన్నారు. సిమ్మన్న తన స్పందనలో తన గురువు ఆచార్య కోలవెన్ను మలయవాసిని ఆశీస్సులతో ఈ సభ జరుగుతుందన్నారు, అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఘండికోట విశ్వనాథం స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష దీపోత్సవం



శ్రీనివాస గోవిందుడు, దామోదర కృష్ణునికి నేతిదీపంతో నీరాజనం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రహదారిలో హరేకృష్ణ వైకుంఠం వద్ద హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా శ్రీవైకుంఠ శ్రీనివాసునికి, శ్రీ దామోదర కృష్ణునికి నిర్వహిస్తున్న లక్ష దీపోత్సవం ఆదివారంతో వైభవంగా ముగిసింది. నిర్వాహకులు గోవిందునికి, దామోదర కృష్ణునికి, భక్తి వేదాంత స్వామి ప్రభు పాదుల వారికి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. చివరి రోజు దీపాల వెలుగులు, సంగీత వాయిద్యాల నడుమ భక్తులు భగవంతుని సేవలో నాట్యం చేస్తూ తన్మయులయ్యారు. తులసి హారతి, తులసి మహారాణికి పూజలు నిర్వహించి ఆమె చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కామిరెడ్డి సత్యనారాయణచే ఆకాశ దీపం, శృతిచే తొలి నేతి దీపం ఆవిష్కరించారు. దామోదర అష్టకం పఠించారు. వివిధ ఆకృతులలో భక్తులు దీపాలు వెలిగించారు. మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస భక్తులను ఉద్దేశించి ప్రవచించారు. యుగాలన్నింటిలో సత్యయుగం, శాస్త్రాలలో వేదం, నదులలో గంగ, మాసాలలో కార్తీకం ఉత్తమమైనవన్నారు. కార్తీకవ్రతం ఆచరిస్తే అనేక పుణ్య నదులలో స్నానం, సంపద దానం చేస్తే వచ్చే ఫలితం కంటే కోటిరెట్లు ఫలితం ఉంటుందన్నారు. యోగులు, సాధువులు వేల సంవత్సరాలు కఠిన తపస్సు చేసినా సాక్షాత్కరించని కృష్ణుడు 5వేల ఏళ్ల క్రితమే యశోద భక్తికి లొంగిపోయి అనుగ్రహించాడన్నారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు అరికట్టాలని భక్తులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంబరీష దాస తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

అల్లిపురం: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ అవగాహన ర్యాలీని కళాశాల విద్యార్థులతో చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించటం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా అంతం చేసే వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.శ్రీలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కేవీఎల్ శిరీష, ఎస్.అనురాధ, డాక్టర్ జె. లావణ్య, డాక్టర్ ఎ. హైమావతి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో వైద్యులు, సెయింట్ జోసెఫ్ కళాశాల సిబ్బంది

సెయింట్ జోసెఫ్‌లో..

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఆదివారం రోటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ప్రారంభించారు. జిల్లా ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ యూనిట్ సహకారంతో హెచ్ఐవి–ఎయిడ్స్, స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ మాణిక్యకుమారి, డాక్టర్ వనిత, డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్ కిటకిట

సోమవారం పోలిపాడ్యమి నేపథ్యంలో పెద్ద ఎత్తున కొనుగోళ్లు



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



అమ్మకానికి సిద్ధంగా అరటి దొప్పలు



పలు రకాల పండ్లు

జగదాంబ: సోమవారం పోలి పాడ్యమి నేపథ్యంలో ఆదివారం పూర్ణామార్కెట్ వినియోగదారులతో కిటకిటలాడింది. నగర నలుమూలల నుంచి వినియోగదారులు మార్కెట్‌కు రావడంతో విపరీతమైన రద్దీ నెలకొంది. తుపాను కారణంగా జల్లులు పడుతున్నప్పటికీ జనం ఆగలేదు. దీంతో ట్రాఫిక్ పోలీసులు జగదాంబ నుంచి వన్‌టౌన్ వెళ్లే దారిలో బారికేడ్లు పెట్టి ట్రాఫిక్‌ను నియంత్రించారు. పువ్వులు 50 గ్రాములు రూ. 150, యాపిల్ కిలో రూ. 250 నుంచి రూ. 350, దానిమ్మ రూ.350, కమలాలు కిలో రూ. 100, ఇతర పండ్లు కిలో రూ. 150కి పైగా అమ్మకాలు చేశారు. నీట్లో వత్తులు వదలడానికి అవసరమైన అరటి దొప్పలు బాగా అమ్ముడుపోయాయి. పసుపు, కుంకుమతో పాటు చెరుకుకు గిరాకీ పెరిగింది.

వైభవంగా అష్టోత్తర కలశాభిషేకం



పార్వతీ పరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నరసింహనగర్ శివారు గణేషనగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో ఆదివారం అష్టోత్తర కలశాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకుడు ఏడిద గురునాథశర్మ ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరులకు కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలశాల కొబ్బరికాయలు అమర్చి పూజలు జరిపారు. ఆలయ అధ్యక్షుడు టి.ఎ స్.ఎన్.మూర్తి, కమిటీ సభ్యులు ప్రకాశరావు, నాయుడు, పైలా రమణ, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా రుద్రాభిషేకం



మహా శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



అఖండ దీపం వెలిగిస్తున్న భక్తులు

అల్లిపురం: కార్తీక మాసం ఆఖరి రోజు సందర్భంగా కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల శ్రీ రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం మహాన్యాస పూర్వక మహారుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రముఖ శివ భక్తులు పీల వెంకట అప్పలనాయుడు (చినబాబు), రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చక స్వాములు మహాన్యాస పూర్వక, నమక, చమక విన్యాశాలతో శైవ ఆగమనంలో చేపట్టిన రుద్రాభిషేకంలో మహాశివునికి పంచామృతాభిషేకాలు, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లతో విశేషంగా అభిషేకాలు చేశారు. అనంతరం కోటి వత్తుల దీపాన్ని వెలిగించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతమంతా పంచాక్షరి మంత్ర జపంతో మార్మోగింది.ఈ కార్యక్రమంలో కళా ఆస్పత్రి అధినేత పైడి రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ మాజీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, ద్రోణంరాజు శ్రీవత్సవ్, బొడ్డేటి ప్రసాద్, సర్వేశ్వరరెడ్డి, రేణుక యల్లమ్మ ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న కృష్ణవేణి

మహారాణిపేట: కాలిన గాయాలతో కేజీహెచ్ బర్న్స్ వార్డులో చికిత్స పొందుతున్న కె.కృష్ణవేణి కోలుకుంటున్నారు. కాలిన గాయాలతో కృష్ణవేణిని ఇటీవల కేజీహెచ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. కృష్ణవేణికి అవసరమైన చోట స్కిన్ గ్రాఫ్టింగ్ ద్వారా శస్త్ర చికిత్స అందిస్తున్నామని ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ టి.మోహనరావు తెలిపారు. కాలిన గాయాలు కొన్ని మానుతున్నాయని, మిలిగిన వాటికి చికిత్స అందిస్తున్నామని ఆయన తెలిపారు.

రుషికొండ భవనాలు వినియోగంలోకి తీసుకురావాలి

సీతమ్మధార : రుషికొండ భవనాల వినియోగంపై ఆదివారం విశాఖ పౌర గ్రంథాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కన్వీనర్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఇటీవల విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి రుషికొండ భవనాలు తిలకించారని, వీటి వినియోగంపై ప్రజల అభిప్రాయాలు తెలియజేయాలని కోరిన నేపథ్యంలో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా హాజరైన అతిథులు మాట్లాడుతూ తక్షణం భవనాలను ప్రజలు తిలకించేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రజాధనంతో కట్టిన భవనాలు ప్రజలకే ఉపయోగపడాలని తెలిపారు.